నారసింహుడిగా పరమేశ్వరి



నారసింహ అవతారంలో విద్యారణ్యపుర కాళికాదుర్గా పరమేశ్వరీదేవి



ప్రసంగిస్తున్న మధుసూదనసాయి

భక్తిశ్రద్ధలతో అతిరుద్ర మహాయాగం

- ఒకేసారి రామతారక, ఆంజనేయ, సాయి గాయత్రి హోమాలు
- 120 మంది వేదపండితులు...
- హాజరైన వేలాదిమంది భక్తులు

వివరాలు7లో..



యాగం చేస్తున్న దృశ్యం

సత్వర సాయం అందించాలి

● వరద ప్రాంతాల్లో అత్యవసర చర్యలు చేపట్టాలి ● ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలి: సీఎం ఆదేశం



బెంగళూరు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లాలో భారీ వర్షాలు, మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదనీటితో తలెత్తిన తీవ్ర పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే సాయం అందించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆయా జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదివారం అత్యవసరంగా రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్‌లతో సీఎం సమీక్ష జరిపారు. కలబురగితోపాటు వివిధ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. కృష్ణానదికి అనుబంధమైన మహారాష్ట్రలోని ఉజ్జయిని, నీరా జలాశయాలనుంచి భారీగా వరదనీరు విడుదల చేయడంతో భీమా నదీ పరీవాహక ప్రాంతాల్లో చోటు చేసుకున్న పరిణామాలపై అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, సీఈఓలు వరద ప్రాంతాలకు వెళ్లి స్వయంగా పరిశీలించి అత్యవసర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శులు పర్యటించాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధిశాఖ, జలవనరులశాఖ, ముఖ్యకార్యదర్శులను ఉత్తర కర్ణాటక వెళ్లాలని ఆదేశించారు. ప్రజలు, పశువులు, పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశుగ్రాసం సమకూర్చాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలబురగి, విజయపుర, బీదర్, రాయచూరు, కొప్పళ తదితర జిల్లాల అధికారులు పాల్గొన్నారు. కాగా కేంద్రమంత్రి కుమారస్వామి ఎక్స్ ద్వారా సందేశం ఇచ్చారు. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో వరదప్రమాదాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలను ఎక్కువమంది పంపి సహాయక చర్యలు ముమ్మరం చేయాలని కోరారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి అండగా ఉంటుందన్నారు. ప్రతి తాలూకాలోనూ పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని, బాధితులకు ఆహారం, తాగునీరు, దుస్తులు సమకూర్చాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రత్యేకదృష్టి సారించాలని, స్కూళ్లు, హాస్టళ్లు, విద్యాసంస్థలను తాత్కాలిక పునరావాసకేంద్రాలుగా మార్చాలని సూచించారు.



కావేరిమాతకు హారతి ఇస్తున్న పండితులు

గంగ తరహాలో కావేరి హారతి

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తరభారత్‌లోని కాశీ క్షేత్రంలో ఏ విధంగా గంగా హారతి ప్రసిద్ధి చెందిందో అదే తరహాలోనే భవిష్యత్తులో కావేరి హారతి కూడా ప్రాచుర్యం సాధించనుందని విశ్వఒక్కలిగ మహాసంస్థాన మఠం పీఠాధిపతి నిశ్చలానందనాథస్వామీజీ అన్నారు. కావేరి హారతిలో పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ కావేరి హారతి ద్వారా బృందావన్ గార్డెన్స్‌లో సాంస్కృతిక వాతావరణం నెలకొంటుందని, ఈ ప్రత్యేకమైన ఆలోచన ద్వారా పర్యాటక రంగానికి ఉత్తేజం ఇచ్చినట్టే అన్నారు. ఎమ్మెల్సీ దినేశ్ గూళిగౌడ మాట్లాడుతూ దక్షిణభారత్‌లో కావేరి హారతి విధానం మరింత ఆకర్షణ కానుందన్నారు. కాగా కేఆర్ఎస్ అంటూనే బృందావన్ గార్డెన్స్ అందరికీ గుర్తుస్తోంది. ప్రదర్శనలో చిన్నారులు సంతోషంగా గడుపుతున్నారు.

● మహాసంస్థాన పీఠాధిపతి నిశ్చలానందనాథస్వామీజీ

కావేరి హారతికి రూ.5 లక్షల విరాళం

కావేరి అంటూనే కన్నడిగులకు అదో సెంటిమెంట్. కావేరి నీటితోనే కోట్లాదిమందికి దశాబ్దాలకాలంగా దాహం తీరుతోంది. కావేరి హారతి పేరిట ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై అమెరికాలో ఉంటున్న బెంగళూరు దంపతులు రూ.5లక్షల విరాళం ప్రకటించారు. అమెరికాలోని ఫీనిక్స్‌లో నివసించే జ్యోతి, వికాస్ దంపతులు విరాళం ప్రకటించారు. ఇదే సందర్భంగా జ్యోతి మాట్లాడిన వీడియోను సోషల్‌మీడియాలో పంచుకున్నారు. కావేరి హారతి కార్యక్రమాన్ని సోషల్‌మీడియాలో వీక్షించానన్నారు. దేశంలోనే పవిత్ర నదులలో కావేరి నది ఒకటని, కావేరి హారతి అర్థవంతంగా నిర్వహించాలని రూ.5లక్షల విరాళం ఇస్తున్నట్టు ప్రకటించారు. బెంగళూరులో పుట్టి పెరిగానని, కావేరి నీటితోనే తర బాల్యం గడిచిందని గుర్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ చదివి అమెరికాలో స్థిరపడినట్లు జ్యోతి తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సంతోషం కలిగించిందన్నారు. ఇదో పుణ్యకారణంగా భావిస్తున్నానన్నారు. భారత్‌కు వచ్చినప్పుడు కావేరి నది చూసేందుకు వెళ్తానన్నారు. ఈ అంశంపై దినేశ్‌గూళిగౌడ స్పందిస్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో చర్చించి కావేరి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.



జ్యోతి, వికాస్ దంపతులు

నీట మునిగిన గుర్జాపూర్ వంతెన

●రాకపోకలు నిలిపివేసిన అధికారులు

రాయచూరు సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై రాయచూరు తాలూకా పరిధిలో నిర్మించిన గుర్జాపూర్ బ్రిడ్జ్ కం బ్యారేజ్ పూర్తిగా నీట మునిగింది. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరగడంతోపాటు మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల వల్ల భీమా నది ఉధృతంగా ప్రవహిస్తుండడమే ఇందుకు కారణం. కృష్ణా-భీమా నదుల సంగమానికి దిగువన ఉన్న గుర్జాపూర్ బ్యారేజ్ వద్ద నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో బ్రిడ్జ్ కం బ్యారేజ్ పూర్తిగా నీట మునిగింది. దీంతో అధికారులు రాయచూరు-యాదగిరి మధ్య ఉన్న వాహనరాకపోకలను నిలిపివేశారు. కృష్ణానదిలో వరద ప్రవాహం పెరుగుతుండడంతో నారాయణపూర్ డ్యాం నుంచి దిగువకు 1.25 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటు హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే 1.25 లక్షల క్యూసెక్కుల వరద నీరు కృష్ణానదిలో ప్రవహిస్తుండగా రాగల రెండు రోజుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



గుర్జాపూర్ వంతెనపై ప్రవహిస్తున్న నీరు

తగ్గిన తల్లీబిడ్డల మరణాలు

● ఆసుపత్రుల్లో ప్రత్యేక సదుపాయాలు ● గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



బెంగళూరు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): బాలింత తల్లి, నవజాతశిశువుల మరణాలు తగ్గించడంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రగతి సాధించింది. ఇటీవల రెండేళ్ల వ్యవధిలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వైద్యసదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు శ్రమ ఫలించింది. దీనికితోడు ఆసుపత్రులలో కాన్పులశాతం గణనీయంగా పెరిగింది. తాలూకా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలకు అనుబంధమైన ఆసుపత్రులలో ప్రత్యేక కాన్పుల విభాగాలు అప్రమత్తంగా పనిచేయడం కూడా ఓ కారణంగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రథమ చికిత్సలు అందించి తాలూకా, కాన్పుల ఆసుపత్రులకు సిఫారసు చేయడం వంటి విధానాలు అనుకూలం అవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీల వివరాలు సమగ్రంగా నమోదు చేస్తారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం ఇవ్వడంతోపాటు వీరికి సంబంధించిన ఆరోగ్య వివరాలను ఆశా కార్యకర్తలకు అందిస్తారు. వారు ఆసుపత్రులలో పరీక్షలు, కాన్పుల వరకు పర్యవేక్షిస్తారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) 2022 ప్రకారం నివేదికలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలో తల్లుల మరణాలు 69 శాతం నుంచి 58కి తగ్గాయి. శిశువుల మరణాలు 21 నుంచి 15కు, నవజాత శిశు మరణాలు 16 నుంచి 12శాతానికి తగ్గింది. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అనేది దేశంలో జనన, మరణాల అందాజు వేసేందుకు జరిగే ప్రక్రియగా ఉంది. శిశుమరణాల ప్రమాణం ప్రతి వెయ్యిమందిలో ఎంతమంది మృతి చెందుతున్నారనేది నిర్ధారిస్తారు. తల్లి ఆరోగ్యం విషయంలో వైద్యశాఖ సురక్షిత చర్యల ద్వారా కూడా సాధ్యమవుతోంది. రాష్ట్రంలో 64.4శాతం కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రులలో సాగుతున్నాయి. వీటిలో 86శాతం కాన్పుల ఆసుపత్రుల లక్ష్య పరిధిలో ఉన్నాయి. లక్ష్య కార్యక్రమం అనేది కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా ఆరోగ్యం విధానం. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల శస్త్రచికిత్సా విభాగం, ఐసీయూ, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పెంచేలా లక్ష్యంగా పని చేస్తోంది. 128 ఆసుపత్రులు జాతీయస్థాయి ప్రమాణాలతో మెరుగుపరిచారు. తద్వారా తల్లీబిడ్డల మరణాలు తగ్గించేందుకు కీలకం అవుతోంది. ప్రస్తుతం 97శాతం కాన్పులు ఆసుపత్రులలోనే కొనసాగుతున్నాయి. అనుభవజ్ఞులైన వైద్యసిబ్బంది తగిన మౌలిక సదుపాయాలు వైద్యసంస్థలలో అందుబాటులో ఉంచారు. ఇది తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడడంతోపాటు అత్యవసర పరిస్థితిని నిభాయించేందుకు వీలవుతోంది.

- నవజాత శిశువుల మరణాల ప్రమాణం తగ్గేందుకు పుట్టిన 28 రోజులలోగా శిశువుల సంఖ్య ఇటీవల కొన్నేళ్లక్రితంతో పోలిస్తే నాలుగైదేళ్లుగా మెరుగవుతూ వస్తోంది. 2021లో దేశంలో వెయ్యి జననాలు జరిగితే 19 నవజాత శిశువులు మృతి చెందేవారు. కర్ణాటకలో ఈ సంఖ్య 13గా ఉండేది. 2022లో దేశవ్యాప్తంగా 19 కాగా, రాష్ట్రంలో 12కు తగ్గుముఖం పట్టింది. నెలలు నిండకనే జననం, తక్కువ బరువుతో జననం, పుట్టినప్పుడు శ్వాసకోశ, నిమోనియా, హృదయ సంబంధితతోపాటు పలు సమస్యలతో నవజాత శిశుమరణాలు కొనసాగుతుండేవి. జాతీయ ఆరోగ్య విధానం 2017-2025 వ్యవధిలో ప్రతి వెయ్యి శిశువుల జననాలలో 16లోపు నవజాతశిశువుల మరణాలను తగ్గించాలని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సూచించింది. ఈ లక్ష్యాన్ని కర్ణాటక రాష్ట్రం ఐదేళ్లలోగానే సాధించింది.
- కాన్పుల వేళ తల్లుల మరణ ప్రమాణాలను మరింత తగ్గించాలని వైద్య ఆరోగ్యశాఖ ఏడు సిఫారసులు చేసింది. ఇటీవల ఏడు నెలలుగా రాష్ట్రంలో తల్లుల మరణాలు 26శాతం కంటే తక్కువగా ఉన్నాయి. ఏఎన్‌సీ చక్ర, గెస్టోసిస్ స్కోరింగ్, గర్భావస్థలో రక్తపోటుకు వ్యతిరేకంగా రోగనిరోధకాలకు కొన్ని కొత్త సాధనలను అనుసంధానం చేశారు. వైద్యులు, నర్సుల సామర్థ్యం పెంపుకోసం చర్యలు చేపట్టారు. ప్రమాదస్థితిలో గర్భిణీలను గైనకాలజిస్టుల ద్వారా పరీక్షలు జరిపేందుకు రాష్ట్రప్రభుత్వం మార్గదర్శకాలు చేసింది. 2030 నాటికి తల్లీబిడ్డల మరణాన్ని గణనీయంగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- ఇదే సందర్భంలో ఐదేళ్లలోపు పిల్లల మరణాలు 26నుంచి 17కు తగ్గించారు. శిశుమరణాల ప్రమాణం 21 నుంచి 15కు తగ్గుముఖం కావడం గమనార్హం. శిశువుల మరణాల ప్రమాణశాతాన్ని తగ్గించేందుకు రాష్ట్రంలోని 10 ఆసుపత్రులలో తల్లిపాల సమగ్ర నిర్వహణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తల్లీబిడ్డల మరణాలను తగ్గించేందుకు మరిన్ని చర్యలు చేపట్టనున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు.




స్వాధీనం చేసుకున్న నగదును ప్రదర్శిస్తున్న పోలీసులు

దోచుకున్నారు.. దొరికిపోయారు..!

● వక్కల వ్యాపారి నుంచి కోటి దోపిడీ
● పోలీసుల అలర్ట్ ● 15 నిమిషాల్లోనే ముఠా అరెస్టు



బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కారులో వెళ్తున్న వక్కల వ్యాపారిని అడ్డుకుని కోటి రూపాయలకుపైగా దోపిడీకి పాల్పడిన ముఠాను 15 నిమిషాల్లోనే చేధించిన బెంగళూరు హుళిమావు పోలీసులు 8మందిని అరెస్టు చేశారు. హాసన్ జిల్లా అరసికెరెకు చెందిన మోహన్ అనే వక్కలవ్యాపారి శనివారం సాయంత్రం 1.01 కోట్ల రూపాయలను బ్యాగులో ఉంచుకుని కారులో బయల్దేరారు. మోహన్ వద్ద పనిచేసే హేమంత్ అనే వ్యక్తి నగదును తీసుకునేందుకు అక్షయ్‌నగర్‌కు వచ్చాడు. నగదును తీసుకుని మోటారాంకు చెందిన కారులో హేమంత్ నగదును ఉంచారు. అదే సమయానికి 8మంది దుండగులు గ్యాంగ్‌గా వచ్చి మారణాయుధాలతో బెదిరించి నగదుతోపాటు కారును దోచుకుని పరారీ అయ్యారు. స్థానికులతోపాటు బాధితులు హుళిమావు పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చారు. హుళిమావు పోలీసులు నగరమంతటా అలర్ట్ చేశారు. దుండగులు నగరం దాటకుండా ఎక్కడికక్కడ కట్టడి చేశారు. కారును గుర్తించిన పోలీసులు చుట్టుముట్టి కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే 8మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడినవారిలో నరసింహ, జీవన్, కిశోర్, వెంకటరాజు, చంద్ర, కుమార్, రవికిరణ్, నమన్ ఉన్నట్టు గుర్తించారు. వక్కలవ్యాపారిని వారు ఉదయం నుంచి వెంబడించినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.



షోరూంను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

బీఎన్‌ఆర్ జ్యువెలర్స్ ప్రారంభం

మహదేవపుర, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మారతహళ్ళిలో బీఎన్‌ఆర్ జ్యువెలర్స్‌ను ఆదివారం ప్రారంభించారు. మంత్రి రామలింగారెడ్డి జ్యువెలర్స్ ప్రారంభంలో పాల్గొని బీఎన్‌ఆర్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి అరవింద లింబావళి, కన్నడ నటి సప్తమిగౌడలు షోరూంను ప్రారంభించారు. బీఎన్‌ఆర్ సంస్థ యజమాని రోహిత్ చరణ్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల నమ్మకమే మా ప్రగతికి సోపానమన్నారు. అన్నివర్గాల వినియోగదారులు ఇష్టపడేలాంటి కలెక్షన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జ్యువెలర్స్ సంస్థ ముఖ్యులు నాగిరెడ్డి, మాజీ కార్పొరేటర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాచనగరిలో.. సారంగ్ చక్కర్లు



అబ్బురపరుస్తున్న సారంగ్ హెలికాప్టర్ల విన్యాసాలు



బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో భాగంగా మైసూరు నింగిలో సారంగ్ హెలికాప్టర్ల చక్కర్లు ప్రజలను మంత్రముగ్ధులు చేశాయి. ఉత్సవాలలో భాగంగా ఎయిర్‌ఫోర్స్ విభాగం శనివారం సారంగ్ విహంగాల విన్యాసాలు ఏర్పాటు చేశారు. 25 నిమిషాలపాటు వైమానిక ప్రదర్శనలలో డాల్ఫిన్ స్లీప్, సారంగ్ స్ప్లిట్, హార్ట్ ఫార్మేషన్, డివైన్ గ్లాస్, డబుల్ ఏరోక్రాస్‌తోపాటు 16 రకాల విన్యాసాలు ప్రదర్శించారు. 75మంది సిబ్బంది శ్రమించారు. ఐదు సారంగ్‌లు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. మైసూరు ఉత్సవాలలో భాగంగా జిల్లా యంత్రాంగం, మైసూరు అభివృద్ధి ప్రాధికార భాగస్వామ్యంతో బన్నిమంటప మైదానంలో ప్రదర్శనలు సాగాయి. వేలాదిమంది ఆసక్తిగా విన్యాసాలను వీక్షించారు.




బన్నిమండప మైదానంలో పైలట్లతో మంత్రి మహదేవప్ప





సీతారామ ఆశ్రమంలో మహాలక్ష్మి అలంకారం, వాసవీమాతకు రత్నాలతో అలంకరణ, విద్యానగర్‌లో దుర్గాదేవిగా..



లక్ష్మీకల్యాణ మండపంలో మత్స్యకన్య అలంకారం

మహాలక్ష్మీ నమోస్తుతే..!

బళ్లారి సిటీ/సిరుగుప్ప, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో ఏడవ రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చింది. సిరుగుప్పరోడ్డు సీతారామశ్రమంలో మహాలక్ష్మి అలంకారం. శ్రీలక్ష్మి కల్యాణ మంటపంలో దేవికి మత్స్యకన్య అలంకారం, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవి మాతకు బంగారు, రత్నాల అంలంకారం, విద్యానగర్‌లో దుర్గాదేవి , కౌల్‌బజార్‌లో పెద్దమ్మ తల్లికి విశేష అలంకారాలు ఆకట్టుకున్నాయి.



మోతి సర్కిల్‌లో..



లక్ష్మీనగర్ క్యాంప్‌లో..



నాటక ప్రదర్శనలో కళాకారులు

ఆకట్టుకున్న జమదగ్ని నాటకం

కంప్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాల కార్యక్రమంలో జగన్మోహన్ రావు వేదికపై ప్రదర్శించిన జమదగ్ని పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. స్వరాజ్జికార కళాసంఘం ఆధ్వర్యంలో కుడుతిని కళాకారులు జమదగ్ని కళాకారుడుగా బి నాగలింగప్ప ఆచార్య, పరశురామపత్ర హెచ్ వన్నూరుస్వామి, రేణుక రాజ పత్ర, హూగర్ మంజునాథ, ధర్యోధనుడి పాత్ర కరియోధన్ పత్ర, మైసూరు కళాకారులతో ఆకట్టుకుని విజయవంతం చేపట్టారు. కళాకారులకు అక్కడున్న అధికారులు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందించారు.

కూలిన ఇళ్ల పరిశీలన

సిరుగుప్ప, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకాలో భారీ వర్షాల కారణంగా 36 ఇళ్లు కూలి భారీగా ఆస్తి నష్టం సంభవించిందన్నారు. శుక్ర, శని వారాల్లో కురిసిన వర్షాలకు తాలుకాలోని అచ్చొళ్లి, మండల పరిధిలో 21 గృహాలు, సిరుగుప్ప పట్టణంలో ఐదు, టెక్కల కోటలో ఐదు, కరూరు గ్రామ పరిధిలో ఐదు ఇళ్లు కూలిపోయాయి. సంఘటనా స్థలాలను విలేజ్ అకౌంటెంట్లు వెళ్లి పరిశీలించారు. తక్షణమే నష్టపరిహారం అందించేందుకు నివేదికలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

అఘాయిత్యాలకు పాల్పడితే చర్యలు

మడకశిర టౌన్, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు. అత్యాచారాలు, వేధింపులకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ నాగేష్‌బాబు హెచ్చరించారు. ఆదివారం మడకశిర సర్కిల్ కార్యాలయంలో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరం చేసేవారిపై చర్యలు ఉంటాయన్నారు.

హంపి వైభవాన్ని చాటి చెప్పాలి: ఏడీసీ

బళ్లారి సిటీ,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత విజయనగర హంపి వారసత్వం, వాస్తుశిల్పం, శిల్పకళ, చారిత్రక వైభవాన్ని ప్రపంచ స్థాయిలో ప్రతిబింబించేలా కృసి చేయాలని విజయనగరం జిల్లా అదరపు జిల్లాకలెక్టర్ బాలకృష్ణప్ప అన్నారు. హంపిలోని ఎదురుబసవన్న ఆలయ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం అనేక ఇతర విభాగాల సహకారంతో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బైక్ ర్యాలీ ,హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. హంపి పర్యాటకం జిల్లా పరిపాలన యెక్క ఆర్థిక అభివృద్ధికి దోహదపడింది. ఇదిస్థానికులకు అనేక ఉద్యోగ అవకాశాలను కల్పించింది. ఇది ఈప్రాంత గ్రామీణాభివృద్ధికి దోహదపడిందన్నారు. ఇది ఈ ప్రాంత గ్రామీణాభివృద్ధికి ప్రయోజనం చేకూర్చిందన్నారు. శ్రీవిజయ విఠల ఆలయలోని గెజ్జల మంటపం నుండి ప్రారంభమైన వారసత్వ నడక మార్కెట్‌వీధి, పుష్కరిణి మీదుగా విజయ విఠల ఆలయం వరకు కొనసాగింది. పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ తలకేరి, జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు అశ్విని కొత్తంబ్రి, హోటల్ యజమానుల సంఘం అధ్యక్షుడు దీపక్, భారత పురావస్తు సర్వే అధికారి రవికుమార్,హెరిటేజ్ యజమాని ప్రసన్న, టూర్ గైడ్స్ సంఘం ఉపాధ్యక్షుడు దేవరాజ్, టూర్‌గైడ్లు,బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ కార్మికులు పాల్గొన్నారు. విజయవిఠల ఆలయం సమీపంలోని ఫోరమ్ కార్యక్రమం జరిగింది, స్థానిక పర్యాటక ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు , భక్తికేంద్రాల పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక కర్తవ్యంగా భావించాలి అని భారత పురావస్తు సర్వే అధికారి దేవరాజ్ అన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ బాలకృష్ణ

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏఐడీఎస్‌ఓ సభ్యులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 118వ జయంతిని ఆదివారం బీఎంఎస్ మైదానం,సెంట్రల్ లైబ్రరీ, సొంతలింగన్న కాలనీ పార్క్ ఇతర ప్రాంతాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఏఎస్‌బీఎస్‌ఓ జిల్లాధ్యక్షుడు ఈరన్న భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆలోచనలను ప్రతిచోట వ్యాప్తి చేసి యువత ఆయన కలలను నెరవేర్చాలన్నారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్‌సింగ్ 23సంవత్సరాల వయస్సులోనే మార్చి 1931న సుఖ్‌దేవ్ ,రాజ్‌గురులతో పాటు అమరవీరుడయ్యాడు. ఇంక్విలాల్ జిందాబాద్ పిలుపుతో ఈవిప్లవ బలిపీఠం కోసం అంకితం చేశారన్నారు. దేశంలోనే ప్రతి పౌరుడికి స్వాతంత్ర్యం అందించాలన్నదే ఆయన ఆశయమన్నారు. ఈసందర్భంగా జిల్లాకార్యదర్శి కంబలి మంజునాథ్, జిల్లాఉపాధ్యక్షుడు ఎం.శాంతి, సమీర్, విజయ్‌కుమార్, వందలాది మంది ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించిన మంత్రి



చిన్నారితో మంత్రి అహ్మద్‌ఖాన్

హోస్పేట,సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యుత్ ప్రమాదంలో కూడ్లిగి సమీపంలో మరణించిన మహిళల కుటుంబాలకు మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ రూ. 5లక్షల పరిహారం అందజేసి మానవత్వం చాటుకున్నారు. బాధితుల తరపున ఆర్థిక సహాయం అందించాలని కుడ్లిడి ఎమ్మెల్యే ఎన్‌టీ శ్రీనివాస్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన ఆయన ఈ సాయం అందజేశారు. కుడ్లిడి నియోజకవర్గంలో రోడ్డు, విద్యుత్ ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 22 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోస్పేట హుడా అధ్యక్షుడు హెచ్‌ఎన్‌ఎఫ్ ఇమామ్ నియాజీ, పంచ హామీ జిల్లా అధ్యక్షుడు కూరి శివమూర్తి పాల్గొన్నారు.

యాప్.. ఫ్లాప్..!

● కులగణనలో కొండలు, గుట్టల్లోకి తీసుకెళ్తున్న మ్యాపింగ్

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వెనుబడిన వర్గాల కులగణన సర్వేలో సాంకేతిక పరమైన సమస్యలు చుక్కలు చూపుతున్నాయి. అడుగడుగునా సమస్యలు తలెత్తడంతో సర్వే అధికారుల పాలిట తలనొప్పిగా మారింది. సిరుగుప్ప తాలూకా పరిధిలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది ట్యాగ్ కాస్త గందరగోళం నెలకొంది. కులగణనలో పాల్గొన్న ఓ ఉపాధ్యాయుడిని ఏకంగా పంటపొలాల్లోకి తీసుకెళ్ళడంతో ఉపాధ్యాయుడు కంగారు పడాల్సి వచ్చింది. తెక్కలకోట గ్రామంలోని 19వ వార్డు రేవణ్ణ సిద్దప్ప లేఔట్ లొకేషన్ ట్యాగ్ ద్వారా వెళ్ళిన ఉపాధ్యాయుడు రెండు ఇళ్ళు సర్వే ముగించిన తరువాత మరో ఇంటికి వెళ్ళేందుకు లొకేషన్ మేరకు వెళ్లగా రెండుమూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండగుట్టల మధ్య ఉన్న వరిపొలాల్లోకి తీసుకెళ్ళింది. అక్కడెలాంటి యూఎచ్‌ఐడీ లేదా ఎలాంటి నివాసాలు లేకపోవడంతో వెనుదిరాగాల్సి వచ్చింది. తాను ఎదుర్కొన్న సమస్యను ఫోటోద్వారా సోషల్ మీడియాలో పంచుకుని ఆవేదన వ్యక్తం చేశారు.



ట్యాగ్‌తో వరిపొలాల్లోకి వెళ్లిన ఉపాధ్యాయుడు

కొనసాగుతున్న సర్వే

కంప్లి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభసామాజిక, విద్య సర్వే గ్రామాల్లో జోరుగా కొనసాగుతోంది. కొంచిగేరి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి లీలావతి ఈ నెల 25 నుంచి తమ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టినట్లు తెలిపారు.



కొంచిగేరిలో సర్వే చేస్తున్న పీడీఓ

విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా త్రివేణి



త్రివేణికి నియామక పత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్ పత్తార్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా త్రివేణి పత్తార్ ఎన్నికైనట్లు నగరంలోని కాళమ్మ వీదిలోని శ్రీ కాళి కాకామటేశ్వర ఆలయ భవనంలో విశ్వకర్మ యూనిట్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ పత్తార్ త్రివేణికి ఆదివారం ఆదేశ లేఖ అందజేశారు. భవిష్యత్తులో సంస్థ మహిళా కార్యకలాపాలను మరింత బలంగా న్విహించే బాధ్యతను ఆమెకు అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా సామాజిక శ్రేష్టతను కాపాడుతానని మహిళా శక్తిని సంస్థ విస్తరణను కొత్త స్థాయికి తీసుకెళ్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా తాలూకాస్థాయి ఆఫీస్ బేరర్లు, మహిళా కార్యకర్తలు ప్రముఖులు ఆమెను అభినందించారు.

ఎడతెరపిలేని వర్షాలతో కూలుతున్న ఇళ్లు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో మట్టి ఇళ్లు కూలిపోతున్నాయి. ప్రధానంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వర్షాల కారణంగా ప్రజలు నిలువ నీడను కోల్పోతున్నారు. ఒకవైపు వర్షపునీరు లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్ళడంతో ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన మట్టి ఇళ్ళు వానకు తడిసి కొన్నిచోట్ల గోడలు కూలుతుండగా... మరోవైపు పైకప్పులు కూలుతుండడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాత్రివేళ్ళలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా పరిధిలోని సిరుగుప్ప తాలూకా తెక్కలకోట ఫిర్కా పరిధిలో శుక్రవారం, శనివారం వారం ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో పలు గ్రామాల్లో జన జీవనం అస్తవ్యస్థంగా మారింది. ఇళ్ళలోకి నీరు చొరబడంతో ఇంటిలో ధాన్యం తడిసి ముద్దయింది. తెక్కలకోట ఫిర్కా పరిధిలో పొప్పనాళ గ్రామాల్లో బసవనగౌడ, కరూరు గ్రామంలో రాధాస్వామి, శేఖణ్ణ, సిరిగేరి గ్రామానికి చెందిన మౌలాసాబ్, ఉప్పార హొసళ్ళి ఎలగార్ వీరభద్ర గౌడ, దరూరు గ్రామానికి చెందిన రోశప్ప, భైరాపుర గ్రామానికి చెందిన ఆదెప్పకు చెందిన ఇళ్ళుతో పాటు ఫిర్కా పరిధిలో సుమారు ఇళ్ళు నేలకూలినట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. ఉప్పార హొసళ్ళి, బలకుంది, నిట్టూరు, కరూరు, దేవినగర్, భైరాపుర, సిరిగేరి, ఎం.సూగూరు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నదున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.



తెక్కలకోట ఫిర్కాలో నేలకూలిన ఇల్లు

అలరించిన నృత్యోత్సవం



కళాకారులను సత్కరిస్తున్న దేవస్థానం అధ్యక్షుడు నాగప్ప

బళ్లారి సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ముండరగి గ్రామంలో వెలసిన రాములమ్మదేవి ఆలయ ఆవరణలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి ప్రదర్శించిన నృత్యోత్సవం భక్తులను అలరించింది. ఈ సందర్భంగా కళాకారులను రాములమ్మ దేవస్థానం అధ్యక్షుడు నాగప్ప, అలివేలు సురేశ్, అరుణ్‌కుమార్ తదితరులు కళాకారులను జ్ఞాపికలు అందజేసి చాలవతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముండరిగి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

గుండె ఆరోగ్యంపై సైకిల్ ర్యాలీ



ర్యాలీకి పచ్చజెండా చూపుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని గుండె ఆరోగ్యంపై కావేరి ఆసుపత్రిలో ఆదివారం ప్రత్యేక జాగృతి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వై ప్రకాశ్, మేయర్ సత్య, ప్రజారోగ్య కమిటీ చైర్మన్ మాదేశ్వరన్‌లు సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. మేయర్ సత్య మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రజలు కనీసం కొంతసమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలన్నారు. సాధ్యమైనంత మేరకు ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్డియాలజిస్ట్ ప్రసన్న మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు కారణంగా గుండెజబ్బులకు దారి తీస్తున్నాయన్నారు. అధిక ఒత్తిడి, రక్తపోటు, కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం, మద్యం వంటి వాటి నియంత్రణకు ప్రజలు తమ అలవాట్లు మార్చుకోవాలన్నారు. అరుల్ జ్ఞానషణ్ముగం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సరైన శారీరక వ్యాయామం పాటించడం ద్వారానే గుండె ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. మూకొండపల్లి, సిప్‌కాట్, టైటాన్ జ్యువెలరీ సర్కిల్, దర్గామీదుగా హోటల్ హిల్స్‌కు ర్యాలీ చేరుకుంది. 15 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కావేరి ఆసుపత్రి వర్గీస్‌జోయ్, శ్రీరామజయం, బిందుకుమారి తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో బాలుడికి గాయాలు

హోసూరు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆటలాడుకుంటున్న మూడేళ్ల బాలుడిని వీధికుక్క ఒక్కసారిగా దాడి కరిచింది. హరీశ్, వెన్నెల దంపతుల కుమారుడు హర్షవర్ధన్ గాయపడ్డాడు. ప్రస్తుతం బాలుడిని హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఐసీయూలో చికిత్సలు అందిస్తున్నారు. వీధికుక్కల దాడి వల్ల తరచూ ఎవరో ఒకరు గాయాల పాలవుతున్నారని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కల దాడులకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోనులో చిక్కిన మూడో చిరుత

రాయచూరు సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో మలియాబాద్ గోశాల గుట్ట పై సంచరిస్తున్న చిరుత పట్టుబడింది. గత వారం రోజులుగా ఈ గుట్ట పై చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్న నేపధ్యంలో అటవి శాఖ తాలూకా అధికారి రాజేశ్ నాయక్ నేతృత్వంలో అధికారులు బోను ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఈ బోనులో చిరుత శనివారం రాత్రి చిక్కుకుంది. ఆదివారం చిరుత బోన్‌లో ఉన్నట్లు తెలుసుకున్న అటవి శాఖ అధికారులు అక్కడికి చేరుకుని దాన్ని తరలించే ప్రయత్నం చేపట్టారు. కాగా ఇదే గుట్ట పరిసరాల్లో ఇప్పటి వరకు రెండు చిరుతలు పట్టుబడగా ఇది మూడవ చిరుతగా అధికారులు చెబుతున్నారు.



బోనులో చిక్కుకున్న చిరుత

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి

● పేద విద్యార్థులకు అండగా ఉంటాం: కమ్మ సంఘం నాయకులు



సమావేశంలో పాల్గొన్న కమ్మ సంఘం నాయకులు

బళ్లారి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కమ్మసంఘం తనుపున కార్తీక వనభోజనాలు, దసరా, దీపావళి, ఇతర పండగలు నిర్వహిస్తామని సింధనూరు కమ్మసంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి శ్రీహర్ష తెలిపారు. కార్యక్రమాల్లో మహిళలు ఉత్సాహంగా భాగస్వామ్యం కావాలని కోరారు. ఆదివారం సింధనూరులో మలమంచిలి వాసుదేవరావు కమ్మవారి కళ్యాణమండపంలో 2025-26 కమ్మవారి సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ విద్యాసంస్థల్లో చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కమ్మసంఘం తరపున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవల్లో ముందు ఉంటామని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ విద్యాసంస్థల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ కమ్మసంఘం సభ్యులు సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మసంఘం కార్యదర్శి మల్లిన శేషగిరి రావు. క్లబ్‌కాకతీయ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, పిన్నమనేని మురళీకృష్ణ. భాస్కర్‌రావు. అఖిల కర్నాటక కమ్మసంఘం జాయిట్ సెక్రెటరీ జీ, కాశీవిశ్వనాత్ చౌదరి, అఖిలకర్నాటక యువ కమ్మసంగం ప్రధా న కార్యదర్శి నెక్కంటి సురేష్, గుల్లపుడి నాగేష్, కమ్మ సంఘం సభ్యులు, రైతులు, పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డీహెచ్‌ఓ



రోగులతో మాట్లాడుతున్న డీహెచ్‌ఓ రమేష్ బాబు

కంప్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కంప్లి ఆరోగ్య సముదాయ ఆస్పత్రిని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి రమేష్ బాబు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన దృష్టిలో వుంచుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను తమకు అందుతున్న చికిత్స విషయంపైన కానీ మౌలిక సదుపాయాలు విషయంపె ఆరాతీశారు. మందుల సరఫరా, వైద్యుల చికిత్సపై ఆయన ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో చికిత్స కల్పించి వారికి ఎలాంటి సమస్యలు కలగకుండా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత తాగు నీరు, విద్యుత్ లైట్లు, డాక్టర్ విధుల్లో పాల్గొన్న విషయంపైన పరిశీలించారు. వారితోపాటు తాలుకా అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఏడీ

సిరుగుప్ప, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి బాటలో నడవాలని సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథరెడ్డి పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణం వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సంఘం సభ్యులకు ప్రభుత్వ పథకాలను పొందడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంజునాథరెడ్డి మాట్లాడుతూ సబ్సిడీ ధరలు వరి, జొన్నలు, కంది, సజ్జలు, విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు నాగన్న గౌడ, మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ వ్యవసాయాధికారి బాలాజీ నాయక్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ మంజునాథరెడ్డి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మెహమూద్ (జయంతి)



బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు మెహమూద్ అలి 1932 సెప్టెంబరు 29న ముంబైలో జన్మించారు. గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా రాణించారు. నాలుగు దశాబ్దాలలో 300కుపైగా సినిమాలలో నటించారు. ప్రత్యేకించి హాస్యపాత్రలతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఉత్తమ హాస్య నటుడిగా, సపోర్టింగ్ యాక్టర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. 2004 జూలై 23న కన్నుమూశారు.

బాలి (జయంతి)



ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు 'బాలి' 1945 సెప్టెంబరు 29న అనకాపల్లిలో జన్మించారు. అసలు పేరు ఎం శంకరరావు. వేల సంఖ్యలో కథలు, నవలలకు బొమ్మలు వేశారు. చిత్రకళపై మక్కువతో 'అమ్మే కావాలి' నవలను రాసి తానే బొమ్మలు గీశారు. 'ఆంధ్రజ్యోతి'లో ధారావాహికంగా ప్రచురితమై పాఠకుల మన్ననలు అందుకుంది. సంపాదకులు పురాణం సుబ్రమణ్యంశర్మ ఆయన పేరును 'బాలి'గా మార్చి ప్రోత్సహించారు. 'చందు' అనే బాలల సాహిత్య పత్రికకు సంపాదకత్వం వహించారు. 2023 ఏప్రిల్ 17న విశాఖపట్టణంలో కన్నుమూశారు.

డాక్టర్ గురవారెడ్డి (పుట్టినరోజు)



డాక్టర్ అన్నపరెడ్డి వెంకట గురవారెడ్డి 1958 సెప్టెంబరు 29న గుంటూరులో జన్మించారు. కీళ్ళ వ్యాధులకు చికిత్సలో సిద్ధహస్తుడు. ఒక ఏడాదిలో 4వేల శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసియా రికార్డు నెలకొల్పారు. కిమ్స్ ఆసుపత్రి సంస్థాపకులలో ఒకరు. హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ ఎక్స్‌పర్ట్. అంతకుముందు ఇంగ్లండులో పదేళ్ళు, అపోలో ఆసుపత్రిలో కొంతకాలం పనిచేశారు. కాగా ఆర్థోప్లాస్టీపై పలు పుస్తకాలు రాశారు. ఢిల్లీ తెలుగు అకాడమీచే ఎక్సలెన్స్ అవార్డు, ఉగాది పురస్కార్ 2010 తదితర గౌరవాలు అందుకున్నారు.

స్వామి వివేకానంద బాటలో నడవాలి



జ్యోతి వెలిగిస్తున్న మాజీ మంత్రి అరవింద లింబావళి

మహదేవపుర, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద మార్గాన్ని అనుసరించి క్రమశిక్షణ, సేవాభావం అలవరచుకుని దేశభక్తితో ప్రజలకు సేవలందించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గం మారతహళ్ళి ఎస్‌బీఆర్ ప్యాలెస్‌లో హోబళి బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు నవీన్‌చౌదరి అధ్యక్షతన ప్రత్యేకంగా ఏర్పాటైన యువమోర్చా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ వల్ల ప్రపంచంలో భారతదేశ గౌరవం పెరిగిందన్నారు. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, కౌశల్యభారత, ముద్రా యోజన వంటివి యువతకు ఎంతో స్ఫూర్తిగా ఉన్నాయన్నారు. లక్షలాదిమంది యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి సాధ్యం అవుతుందన్నారు. ప్రధాని మోదీ దూరదృష్టి, స్వామి వివేకానంద ఆదర్శాలు అనుసరణీయమన్నారు. సమావేశంలో హోబళి బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యువమోర్చా ప్రధాన కార్యదర్శులు తేజస్, రఘు, నాగభూషణ్, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినిపై అత్యాచారం

నిందితుడు అరెస్టు



అభిషేక్

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడి వీడియోలు తీసుకుని బెదరింపులకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేశారు. హావేరి జిల్లా శిగ్గావి తాలూకా తడసా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసినట్టు ప్రకటించారు. ఈనెల 15న నర్సింగ్ విద్యార్థిని కళాశాల ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మమదాపుర గ్రామానికి చెందిన అభిషేక్ లక్ష్మణప్ప లమాని కిడ్నాప్ చేశాడు. సమీపంలోని అటవీప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇదే సమయంలోనే వీడియోలు చేసుకున్నాడు. ఆ తర్వాత చెప్పినట్టు వినకపోతే వీడియోలు వైరల్ చేస్తానంటూ బెదిరించాడు. ఈనెల 17న రాత్రి విద్యార్థినిని బెదిరించి చెప్పినచోటుకు రావాలంటూ వేధించాడు. అక్కడికి వెళ్లిన విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బహిరంగం చేయకపోతే వేధింపులు ఎదుర్కోవాల్సి ఉంటుంది లేదంటే వీడియోలు బయటకు వస్తే పరువు పోతుందని భయపడుతూ గడిపారు. ఈనెల 24న 1098కు ఫోన్‌చేసి పోలీసులకు బాధిత విద్యార్థిని సమగ్ర వివరాలు తెలిపారు. దీంతో తడసా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం అరెస్టు చేశారు.

భూవివాదంలో ఘర్షణ

కుందుర్పి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబుగుంపల పంచాయతీ కొలిమిపాలెం గ్రామానికి చెందిన గోవిందు తన పొలంలో టమోటా సాగు చేశాడు. పక్క పొలం యజమాని నరసింహ ఆ పొలం తనకు వస్తుందని పలుమార్లు ఘర్షణకు దిగాడు. ప్రస్తుతం గోవిందు సాగుచేసిన టమోటా పంటను, బోరుబావి పైపులను ఆదివారం ధ్వంసం చేశాడు. ఆ రైతులు ఘర్షణ పడ్డారు. గోవింద్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసును నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తామని పోలీసులు తెలిపారు.

సత్యసాయి గ్రామంలో అతిరుద్ర మహాయాగం



యాగంలో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



యాగంలో కొలువుదీరిన శివపార్వతులు, కలశాలు

పాల్గొన్న వేలాదిమంది భక్తులు

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేనహళ్ళికి అనుబంధమైన సత్యసాయిగ్రామంలో సద్గురు మధుసూధన సాయి ఆధ్వర్యంలో అతిరుద్ర మహాయాగం సాగుతోంది. నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని యాగం జరుపుతున్నారు. అతిరుద్ర హోమం తోపాటు రామతారక హోమం, అంజనేయహోమం, సాయిగాయత్రి హోమాలను ఆదివారం జరిపారు. ఏడోరోజు 120మందికిపైగా వేదపండితులు యాగం జరుపుతున్నారు. విశ్వశక్తికి మూలమైన శివుడి ఆరాధనలో అతిముఖ్యమైనది అతిరుద్రయాగంను ఐదేళ్లకోసారి విశ్వ శాంతికోసం నిర్వహిస్తారు. కృష్ణ యజుర్వేద సంహితలో నాల్గో కాండం రుద్ర అధ్యాయంలో ప్రస్తావించిన నమకం, చమకంల కలయికనే రుద్రం అంటారు. 11 నమకాలను పఠించడం, ఒక చమకాన్ని పూర్తి చేయడం ఏకదశ రుద్రం అవుతుంది. 11 ఏకదశరుద్రంలు పఠించడం లఘురుద్రం లేదా రుద్ర ఏకాదశి అంటారు. 11 లఘురుద్రంలు పఠిస్తే ఒక మహా రుద్రం కాగా 11 మహారుద్రంలను పఠించడం ఒక అతిరుద్రం అవుతుంది. 11 హోమగుండాలను ఏర్పాటు చేసి ప్రతి గుండం చుట్టూ 11మంది వేదపండితులు శివుడికి పవిత్ర అర్ఘ్యాలను సమర్పిస్తారు. ప్రతి పండితుడు ప్రతిరోజూ 11 రుద్ర నమకాలు, 11 అనువాకాలు, రుద్ర చమకాలు పారాయణ చేస్తారు. 11రోజులపాటు 14,641 రుద్రనమకాలు, 1331 రుద్రచమకాలు పఠిస్తారు. సత్యసాయిగ్రామంలో ఐదేళ్లకోసారి విశ్వశాంతికోసం అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తారు. భక్తులను ఉద్దేశించి మధుసూధనసాయి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. రామతారకమంత్రం విశిష్టతను ప్రస్తావించారు. ధర్మానికి రాముడు ప్రతీక అని, దాన్ని నిర్వర్తించేందుకు రాముడు తన సర్వస్వం త్యాగం చేశారన్నారు. ధర్మాన్ని రక్షించడం ముఖ్యమన్నారు. వృత్తి ఏదైనా సంతృప్తి చెందాలని సనాతనధర్మం వేల ఏళ్లకిందటే వివరించారన్నారు. ఇదే వేదికపై డాక్టర్ హస్ముక్ అదియాకు వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ గ్లోబల్‌లీడర్‌షిప్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. గుజరాత్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ఆర్థికవేత్తగా సుపరిచితులు. ఇటీవల దశాబ్దంలో నోట్ల రద్దు నుంచి జీఎస్టీ దాకా ఆర్థిక సంస్కరణల రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. కార్యక్రమంలో లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ మాట్లాడుతూ విద్యాభ్యాసంతోపాటు ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలన్నారు. గురుశిష్యుల పరం పరకు శతాబ్దాల చరిత్ర ఉందన్నారు. ముద్దేనహళ్ళి అనే కుగ్రామంలో ప్రపంచం చూసేలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సేవాభావాలు కొన సాగుతున్నాయన్నారు. నిస్వార్థసేవా దృక్పథం పెంపొందించు కోవాలన్నారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి రూపం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. బొమ్మలకొలువులో సత్యసాయి బాబా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించారు. మహాయాగాన్ని వీక్షించేందుకు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు



గిరినగర్ వాసవీమాతకు వజ్రాంగి అలంకరణ



ఉత్తరహళ్ళి వినయ్‌గురూజీ ఆశ్రమంలో దుర్గాదేవి



శిడ్లఘట్ట గాయత్రీదేవికి వైష్ణవీదేవి అలంకరణ



దొడ్డజాల ముత్యాలమ్మదేవికి భూవైకుంఠ అలంకరణ



కత్రిగుప్పె రాజేశ్వరీదేవికి సరస్వతి అలంకరణ



చామరాజపేట వాసవీమాతకు మయూర అలంకరణ

సంతోషిమాత ఆలయంలో దసరా వేడుకలు



ఆలయంలో దసరా ప్రత్యేక పూజలలో భక్తులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి వేడుకలలో భాగంగా అరికెరె శాంతినికేతన్ లే అవుట్ శాంతిధామలో వెలసిన సాయి సంతోషిమాతా ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. ఏడోరోజు మహాచండి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజూ ఒక్కో అలంకరణ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం సుమారు రెండు గంటలపాటు కుంకుమార్చనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజూ అభిషేకం, పుష్పాలతో అలంకరణ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రకాశ్ నర్వాణిలు ఉత్సవాలను పర్యవేక్షించారు. ప్రత్యేక ఆకర్షణగా శాంతి ధామ లో షిర్డీసాయిబాబా, మంజునాథస్వామి ఆలయాలు ఉండడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మురళి, భాగ్యలక్ష్మి, పురుషోత్తమ్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సేవలను ప్రశంసించారు. ఆలయ ట్రస్టు పదాధికారులు మనోహర్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్‌గుప్త, తదితరులు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సాధువుల జ్ఞాన మార్గంలో నడవండి

కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

చింతామణి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్వం త్యాగం చేసిన సాధువు పుంగవులు చూపిన జ్ఞానమార్గంలో సాగాలని, ఇది భావి తరాలకు మార్గదర్శకం అవుతుందని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. తాలూకాలోని పుణ్యక్షేత్రం కైవార సమీపాన ప్రకృతి రమణీయత నడుమ వెలసిన యోగ నరసింహస్వామి వైకుంఠ యాగశాలలో శ్రీరామభవతారక మంత్ర రామకోటి జప యజ్ఞంను ప్రారంభించి మాట్లాడారు. పక్షులకు రెక్కలు ఉన్నా అవి ఆకాశంలో కొంతదూరం మాత్రమే ఎగరగలవు. అయితే జీవన్ముక్తులైన సాధువులు మనసుతోనే ఏ స్థలానికైనా వెళ్లగలరన్నారు. పూర్వజన్మ జ్ఞానం, అదృశ్యమయ్యే శక్తులు వారికి తపస్సువల్ల లభించేవన్నారు. పర కాయప్రవేశం చేయగల ఉండేవారన్నారు. ఇంతకుమించిన వివేకజ్ఞానం యోగుల వద్ద ఉండేదని, ఇది మోక్షానికి సాధన కాగలదన్నారు. ఇంతటి యోగి కైవార సద్గురు యోగి నారేయణ తాతయ్య బోధించిన శ్రీరామ భవతారక మంత్రాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తొలుత ఘంటానాదం, సుప్రభాతం, గోపూజ నిర్వహించారు. అనంతరం మఠంలోని దేవతలకు పూజలు చేశారు. మఠం ఉపాధ్యక్షులు జే విభాకరరెడ్డి, కోశాధికారి ఆర్‌పీఎం సత్యనారాయణ్, విద్వాన వానరాశి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

నిత్యం వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



హృదయం ఆకారంలో ఇలా..

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం ప్రతిరోజూ వ్యాయామం చేయాలని రవాణాశాఖ కమిషనర్ యోగేశ్ పిలుపునిచ్చారు. కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఎలక్ట్రానిక్‌సిటీలో కావేరి బీట్స్ 2025 పేరిట మారథాన్, వాకథాన్, సైకింగ్ పోటీలు నిర్వహించారు. 5వేలమందికి పైగా భాగస్వామ్యులయ్యారు. కావేరి ఆసుపత్రుల డైరెక్టర్ విజయభాస్కరన్ మాట్లాడుతూ డోంట్ మిస్ ఏ బీట్ పేరిట గుండె ఆరోగ్యంపై ప్రజలలో అవగాహన తీసుకురావాలని వాకథాన్ పోటీలు నిర్వహించామన్నారు. హృదయ ఆకారంతో నిలబడి సందడి చేశారు.



రన్‌కు జెండా ఊపుతున్న ప్రముఖులు

తెలుగుతల్లి పాత్రలో సీనియర్ నటి రమాప్రభ



తెలుగుతల్లి పాత్రలో రమాప్రభ

బెంగళూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుతల్లి పాత్రలో సీనియర్ నటి రమాప్రభ నటిస్తున్నారు. బ్రహ్మ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చిక్కబళ్ళాపుర జిల్లా లోని ప్రాచీనమైన పాండురంగస్వామి ఆలయంలో లఘుచిత్రానికి శ్రీకారం చుట్టారు. సీపీ బ్రౌన్ సేవా సమితి అధ్యక్షులు ఇడమకంటి లక్ష్మిరెడ్డి రచించి దర్శకత్వం వహిస్తున్న సినిమాను తెలుగు విజ్ఞాన సమితి సౌజన్యంతో నిర్మిస్తున్నారు. తెలుగు భాష నిఘంటువులకు ప్రాణం పోసి భాషను సజీవం చేసిన సీపీ బ్రౌన్ బ్రిటీష్ దొర పాత్రలో బాలాజి అయ్యర్, రెండోపాత్రలో ముంబైకు చెందిన యువనాయకుడు రాయల్ నటించారు. బ్రౌన్ కాలం నుంచి తెలుగుభాషా సంస్కృతి ఎదిగిన విధానంపై సమగ్రంగా రూపొందిస్తున్నట్టు లక్ష్మిరెడ్డి వివరించారు. దశాబ్దాల కాలంగా తెలుగు సినిమాలలో అగ్రనటిగా రాణించి ఇటీవల కొంతకాలంగా నటనకు దూరంగా ఉన్న రమాప్రభ ప్రముఖపాత్ర పోషిస్తున్నారన్నారు. అయోధ్యపురం కృష్ణారెడ్డి పాత్రను స్వయంగా నటిస్తున్నట్టు లక్ష్మిరెడ్డి తెలిపారు. నంది హిల్స్‌తోపాటు చిక్కబళ్ళాపుర ప్రాంతాలలో చిత్రీకరణ జరుపుతున్నామన్నారు. నటి రమాప్రభ మాట్లాడుతూ ఆరేళ్ల విరామం తర్వాత కెమెరా ముందుకు వచ్చిన అనుభూతి కలిగిందన్నారు. తెలుగుతల్లి పాత్రను పోషించే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ తెలుగుతల్లి లఘుచిత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ప్రదర్శించాలని కోరుతున్నామన్నారు.

బంగారు ఆభరణాలంటే మహిళలకు ఇష్టం



శాఖ ప్రారంభోత్సవంలో డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

నవరతన్ జ్యువెలర్స్ ప్రారంభోత్సవంలో డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలంటే మహిళలకు ఎంతో ఇష్టమని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. కనకపుర రోడ్డు వాజరహళ్ళి మెట్రో స్టేషన్ వద్ద ఎస్ఎస్‌బీ ఆర్కేడ్‌లో నవరతన్ జ్యువెలర్స్ ఏడో శాఖను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ బంగారం ధర పెరిగిందని నమ్మకం ఉన్న చోట కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులు నాణ్యమైన ఆభరణాలను విక్రయించి విశ్వాసం చూరగొనాలన్నారు. దేశంలో అత్యుత్తమమైన డిజైన్లు రూపొందించే నైపుణ్యత కల్గినవారు ఉన్నారని, ప్రపంచస్థాయిలో ఇదే ఆదరణకు కారణమన్నారు. నవరతన్ జ్యువెలర్స్ గౌతమ్‌చంద్ బాప్నా మాట్లాడుతూ టెంపుల్, యాంటిక్ ఆభరణాలతోపాటు బోటిక్, అలంకరణ వస్తువులు, వజ్రాభరణాలు ప్రపంచానికి పరిచయం చేసేలా నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ఎంజీ రోడ్డు, జయనగర్, రాజాజినగర్, యలహంక, సిటీ స్ట్రీట్, కేఆర్ పురలోశాఖలు ఉన్నాయని, కనకపుర రోడ్డులో ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజలకు అనుకూలం కానుందన్నారు. సంస్థ ముఖ్యులు మితేశ్‌బాప్నా, మహేంద్రబాప్నా తదితరులు పాల్గొన్నారు.

శాంతిధామలో మెగా ఆరోగ్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవాకార్యక్రమంలో భాగంగా అరికెరె శాంతిధామలో ఆదివారం మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం వరకు కొనసాగింది. నానో ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారం అందించారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు థైరాయిడ్, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 300మందికిపైగా శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కాగా తరచుగా సమాజిక సేవలలో భాగంగా ఇటువంటి శిబిరాలు నిర్వహిస్తుంటామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఆలయ ట్రస్టు కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ, మనోహర్ గుప్తా, కృష్ణయ్యశెట్టి, సత్యనారాయణగుప్త, వెంకటేశ్‌గుప్త, బీజేపీ నాయకులు అరికెరె వార్డు అధ్యక్షుడు మంజునాథ్, లక్ష్మణ్‌రెడ్డి, శివాజి తదితరులు పాల్గొన్నారు.